క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం జయమాలిని

కొందుర్గు: ఇందిరమ్మ గృహాలు మంజూరైన లబ్ధిదారులను ప్రోత్సహిస్తామని ఐకేపీ ఏపీఎం జయమాలిని తెలిపారు. మండలంలోని పుల్సు మామిడి గ్రామంలో ఇళ్లు మంజూరైన 36 మందికి శనివారం పంచాయతీ కార్యదర్శి ఫయాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లబ్ధిదారులకు బ్యాంకు ద్వారా రూ.2 లక్షల వరకు రుణం అందించేలా చూస్తామన్నారు. ప్రతిఒక్కరూ సకాలంలో ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షరీఫాబేగం, నాయకులు జహంగీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలో ఉన్న అన్నపూర్ణాలయంలో కాంగ్రెస్ నాయకుడు జాంగారి రవి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాల్‌రాజ్‌గౌడ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రాయికల్ శ్రీనివాస్, భార్గవ్‌కుమార్‌రెడ్డి, తుపాకుల శేఖర్, శ్రీశైలంగౌడ్, ఆశంబాబు, క్రాంతి కుమార్, శేఖర్, సీతారాం, అశోక్, గణేశ్‌గౌడ్, శ్రీధర్, సుదర్శన్, నవీన్, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న గ్రంథాలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. భయాన్ని వీడి పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి క్యూసెట్ శ్రీనివాస్, కోశాధికారి రవీందర్‌గౌడ్, డైరెక్టర్లు రాజేశ్, శ్రీకాంత్, శివరాములు, కృష్ణారెడ్డి, రాజుగౌడ్, హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల, మహిళలు

కేశంపేట: మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అనసూయ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు.. స్పష్టత కరువు

యాచారం: అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ అన్నారు. ఇళ్లు ఎప్పుడు మంజూరు చేస్తారోనని పేదలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రైతుభరోసా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు ప్రతీ వారం వేతనాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో పోరుబాటకు సిద్ధమవుతామని పేర్కొన్నారు.

‘పది’కి ఏర్పాట్లు పూర్తి

- పరీక్షా కేంద్రాల్లో అందుబాటులో తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రాలు
- సాక్షితో ఎంఈఓ అంగూర్‌నాయక్





కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన ‘ఏ’ పరీక్షా కేంద్రం

కొత్తూరు: ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి అంగూర్ నాయక్ తెలిపారు. త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణపై సాక్షి శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన విద్యార్థుల కోసం పలు వివరాలు వెల్లడించారు. ఈ నెల 20వ తేదీన కేంద్రాల్లో విద్యార్థుల హాల్‌టికెట్స్ నెంబర్ల జాబితాను అంటిస్తామన్నారు. అదేరోజు విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కేంద్రాలకు చేరుకొని తమ హాల్‌టికెట్ నంబర్, పరీక్ష రాసే తరగతి గదులను తెలుసుకోవాలని కోరారు.

SAKSHI INTERVIEWS

ప్రశ్న: కొత్తూరు మండలంలో ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు, ఎన్ని పరీక్షా కేంద్రాలు ఉన్నాయి?

జవాబు: మున్సిపాలిటీతో పాటు మండలంలో మొత్తం 562 మంది బాల, బాలికలు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం మూడు కేంద్రాలు ఏర్పాటు చేశాం. జెడ్పీహెచ్‌ఎస్ కొత్తూరు-ఏ కేంద్రంలో 220, బీ-కేంద్రంలో 186, మాంటిస్సోరి ప్రైవేట్ పాఠశాలలో 156 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న: విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఎంత ముందుగా చేరుకోవాలి?

జవాబు: మొదటి రోజు విద్యార్థులు సుమారు 30 నిమిషాల ముందే చేరుకోవాలి. సరైన సమయానికి వెళ్దామనుకుంటే ఒక్కోమారు ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: పరీక్షల నిర్వహణ సమయం?

జవాబు: తెలంగాణ విద్యాశాఖ పదో తరగతి పరీక్షలను రాసేందుకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కేటాయించింది.

ప్రశ్న: విద్యార్థులు తమవెంట తెచ్చుకోవాల్సిన వస్తువులు ఏమిటీ?

జవాబు: పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పెన్నులు, స్టేషనరీ తప్పకుండా తమవెంట తెచ్చుకోవాలి.

ప్రశ్న: దివ్యాంగులైన విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించారు?

జవాబు: దివ్యాంగులైన విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోనికి వెళ్లే విధంగా ర్యాంపులు ఏర్పాటు చేశాం. వారికి పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది సహాయం చేస్తారు.

ప్రశ్న: చీకటి, సరైన వెలుతురు లేని గదుల్లో లైట్లు ఏర్పాటు చేశారా?

జవాబు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి కేంద్రంలో లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశాం. ఏ కేంద్రంలో కూడా విద్యార్థులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

ప్రశ్న: కేంద్రాల్లో విద్యార్థులు అస్వస్థతకు గురైతే ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారా?

జవాబు: కేంద్రాల బయట పీహెచ్‌సీ సిబ్బంది అందుబాటులో ఉంటారు. విద్యార్థులు అస్వస్థతకు గురైతే ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తే వారికి అవసరమైన వైద్యాన్ని అందిస్తారు.

ఏఐ పరిజ్ఞానంతో విద్యార్థులకు మేలు

ఎంఈఓ పురన్‌దాస్



మాట్లాడుతున్న ఎంఈఓ పురన్‌దాస్

చేవెళ్ల: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులను సిద్ధం చేసేందుకు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు పరిచయం చేయడం హర్షణీయమని మండల విద్యాధికారి ఎల్.పురన్‌దాస్ అన్నారు. మండలంలోని తంగడపల్లి పాఠశాలలో శనివారం ఏఐ కంప్యూటర్ పరిజ్ఞానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి ఎంపిక చేసిన పాఠశాలలో తంగడపల్లి ఉండటం విద్యార్థుల అదృష్టమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, గ్రామస్తులు సయ్యద్ గయాస్, జాకీర్, గ్రామ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ప్రతిదీ సాధ్యమే

- ప్రధానోపాధ్యాయురాలు రేవతి
- దూసకల్ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

షాద్‌నగర్: కృషి, పట్టుదల ఉంటే ఏదీ అసాధ్యం కాదని హెచ్‌ఎం రేవతి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు భవిష్యత్తులో చేపట్టే వృత్తులు, వారి కలలు అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంబంధిత వేషధారణలో పాఠశాలకు హాజరయ్యారు. కలెక్టర్‌గా సిరిచందన, ఉపాధ్యాయురాలిగా అవంతిక, డాక్టర్‌గా రేనీషా, నర్స్‌గా తనుశ్రీ, ఇంజనీర్‌గా శ్రావ్య, పోలీస్‌గా రమ్య వ్యవహరించారు. అనంతరం వారి భవిష్యత్తు ప్రణాళికను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు వివరించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, అన్నపూర్ణ, శైలజ, బుద్ధదేవ్, రెడ్యాలాల్, సంతోష్‌బాబు, సర్పరాజ్ అన్వర్, డాక్టర్ శ్వేత పాల్గొన్నారు.

దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కొందుర్గు: మండలంలోని చింతల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ నూతన కమిటీ సభ్యులు శనివారం ఈఓ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్‌గా రాఘవేందర్‌గౌడ్, వైస్ చైర్మన్‌గా లంకాల రామకృష్ణారెడ్డి, సభ్యులుగా ఊషయ్య, యాదమ్మ, చెన్నయ్య ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కొందుర్గు లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, నాయకులు మాసయ్యగౌడ్, లింగంగౌడ్, శివారెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం అవసరం

మండల విద్యాధికారి వెంకటయ్య



రెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటయ్య

మొయినాబాద్: ప్రపంచమంతా సాంకేతిక రంగంలో వేగంగా పరుగెడుతున్న తరుణంలో విద్యార్థులకు అడ్వాన్స్ సాంకేతిక నైపుణ్యం చాలా అవసరమని మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూటర్ ఆధారిత బోధనా సామర్థ్యాలను మెరుగు పర్చడానికి పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని 9 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో భాగంగా మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్, పెద్దమంగళారం, రెడ్డిపల్లి గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఎంపికచేసి శనివారం తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ పాఠ్యాంశాల పరిజ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ఉంటేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రస్తుతం అడ్వాన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు అవసరమని ప్రభుత్వం భావించిందని, అందుకే ప్రత్యేక తరగతులు నిర్వహించే ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మలయ్య, ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, బాలయ్య, ఎస్‌టీఎఫ్ మండల అధ్యక్షుడు సుధాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోర శ్రీనివాస్, ఉపాధ్యాయులు బాలరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



షాబాద్: కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కేశంపేటలో..

షాబాద్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన కాన్షీరామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ జనసమితి చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి నాగని రామకృష్ణ(ఆర్కే) పేర్కొన్నారు. శనివారం కాన్షీరామ్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సైకిల్‌పై భారతదేశాన్ని చుట్టి బహుజనులను చైతన్యం చేసి రాజ్యాధికార ప్రాముఖ్యతను చాటిచెప్పారన్నారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆయూబ్, తాళ్లపల్లి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అక్కమొళ్ల ఆంజనేయులు, నాయకులు బాలరాజ్, మల్లేశ్ ఉన్నారు.

ఘన నివాళి

కొందుర్గు: మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు పెంటయ్య, సంజీవ, నవీన్ పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: మండల కేంద్రంలో బహుజనుల ముద్దుబిడ్డ మాన్యశ్రీ కాన్షీరాం జయంతిని ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మల్లేశ్, శివ, రవి, ఆనంద్, విష్ణు, కృష్ణ, శ్రీకాంత్, పురుషోత్తం, నరేశ్, శ్రీకాంత్, కృష్ణ, భాస్కర్, ప్రవీణ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిపూట బడులు ప్రారంభం



అజీజ్‌నగర్ పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: ఒంటి పూట బడులు శనివారం నుంచి ప్రారంభమైనట్లు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు సమయాన్ని పాటిస్తూ పాఠశాలలకు చేరుకోవాలని, పాఠశాలలు వదిలిన తర్వాత ఎండలో తిరగకుండా తమ ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.

బీఆర్‌ఎస్ నాయకులపై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు అందజేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నేతలు

ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి, అభ్యంతకరమైన రీతిలో సోషల్ మీడియాలో పోస్టు చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రేవంత్ ప్రతిష్టతను దెబ్బతీసేవిధంగా సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పెట్టడం దారుణమన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కిషోర్‌తో పాటు ఆ సంఘం నేతలు అయ్యాన్, సచిన్, వెంకట్ ఉన్నారు.

హామీల పేరుతో మోసం

బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహాయాదవ్

కేశంపేట: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నర్సింహాయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో నర్సింహాయాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో పాటు రైతులను మోసం చేసిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్ పార్టీని నమ్మిన రైతులు, సబ్బండవర్గాల ప్రజలు మళ్లీ మోసపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు ఇచ్చిన రైతు భరోసా వెంటనే అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు భరోసా నిధుల విడుదలను రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలలో మొదలుపెట్టినా మార్చి నెల ముగుస్తున్నా నేటికీ అందరికీ అందలేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తరువాతే ఉద్యోగాల భర్తీ



దీక్షలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణ చేసిన తరువాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, మాదిగలకు జనాభా ధమాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ తలకొండపల్లి మండల కేంద్రంలో సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం ఐదో రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతయ్య ప్రారంభించారు. శిబిరంలో నాయకులు బాలస్వామి, రాములు, శివ, పెంటయ్య, ప్రదీప్, మహేశ్, శంకరయ్య, జగన్‌లు కూర్చున్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు కుమార్, నారాయణ, సంపత్, మహేశ్, శేఖర్, సురేశ్, జంగయ్య, గిరి, ఉపేందర్ పాల్గొన్నారు.

అంబలి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



బాటసారులకు జావ అందజేస్తున్న లయన్ సభ్యులు

కడ్తాల్: రాగి అంబలి కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో మహ్మద్ బాసిత్‌అలీ- ఖైరున్నీసా బేగం జ్ఞాపకార్థం వారి కుమారులు ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏటా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాటసారుల కోసం అన్నదానం, అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జావ తీసుకోవడం వలన చల్లదనంతో పాటు, పౌష్టికాహారం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో జహంగీర్‌అలీ, లాయఖ్‌అలీ, అజ్గర్‌అలీ, ఆసిఫ్‌అలీ, హిమాయత్‌అలీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, రాజేందర్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు నేతిప్రభు, లింగం, ఇమ్రాన్‌బాబా, లక్ష్మయ్య ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో రూ.15 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎస్‌డీఎఫ్ కింద రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయని వారు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుజ్జల మహేశ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు చెన్నకేశవులు, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాజిరెడ్డి, కృష్ణయ్య, రఘుపతి, జంగయ్య, శ్రీశైలం, పెంటయ్య, మల్లేశ్‌గౌడ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రేషన్ కార్డు మంజూరు పత్రం అందజేస్తున్న నాయకులు

మంచాల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి ఆరుట్ల గ్రామంలో కొత్త రేషన్ కార్డు మంజూరు పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో 755 మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వం అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని, రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, చెరుకు నర్సింహ, కృష్ణ, బుగ్గరాములు, అంతటి రాజు, మార సురేష్, బాషయ్య, రమేష్, చంద్రయ్య, వస్పరి కుమార్, శ్రీనివాస్‌గౌడ్, అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.